క్లుప్తంగా

రోగులకు రుచికర భోజనం



డైట్ విభాగాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులకు రుచికరమైన భోజనం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన ఆసుపత్రిలోని డైట్, పేయింగ్ బ్లాక్, ఆరోగ్యశ్రీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న భోజన వసతుల గురించి తనిఖీ చేసి, డైట్ విభాగంలో ఆహార వస్తువులను, రేషన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. డైట్, పేయింగ్ బ్లాక్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గోవిందు, క్రిష్ణమూర్తి ఉన్నారు.

మెరుగైన వైద్యమందించాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(ఎంఎల్‌హెచ్‌పీ) మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో హాలహర్వి, ఎస్.హాలహర్వి, గూడూరు, హర్దగేరి, గోనెగండ్ల పీహెచ్‌సీల నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను గ్రామీణ స్థాయిలో రోగులకు వైద్యం ద్వారా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రుక్మిణి, డీపీఓ విజయరాజు, నోడల్ అధికారులు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మదర్ పీత్రా సేవలు విస్తరిస్తాం



పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మేత్రాసన పాలనాధికారి చౌరప్ప

కర్నూలు(టౌన్): స్వర్గీయ మదర్ పీత్రా సేవలు విస్తరింపజేస్తున్నట్లు కర్నూలు మేత్రాసన పాలనాధికారి ఫాదర్ మోన్ సిగ్నోర్ చౌరప్ప అన్నారు. శనివారం స్థానిక వెంకాయపల్లెలో దీన సేవన సభ వ్యవస్థాపకురాలు మదర్ పీత్రా 100 సంవత్సరాల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు కుట్టుమిషన్లు, పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు మదర్ పీత్రా ఎండోమెంటు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సెయింట్‌జోసఫ్ కళాశాల ప్రిన్సిపాల్ శౌరీలు రెడ్డి, విమల ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శిల్పా,ఫాదర్ జోజిరెడ్డి, ఫాదర్ సుధాకర్, సిస్టర్లు దీప్తి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్

కర్నూలు(లీగల్): ప్రజా వినియోగ సేవల చట్టాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన అవసరమని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, లోక్ అదాలత్ జడ్జి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు, డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం వారికి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఫిలాసఫిలో డాక్టరేట్



డాక్టరేట్ పొందిన ఎస్.వినోద్‌కుమార్

కర్నూలు సిటీ: కోడుమూరు బీఈడీ కాలేజీలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వినోద్ కుమార్‌కు ఫిలాసఫి ఇన్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ వచ్చింది. నియోజకవర్గ కేంద్రం కోడుమూరుకు చెందిన ఈయన మేఘాలయ రాష్ట్రంలోని జోరాబాత్‌లో ఉన్న సీఎంజే యూనివర్సిటీలో ఫిలాసఫి ఇన్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆచార్య డా.విజయకుమార్ చౌహాన్ పర్యవేక్షణలో 'యూటీలిటి ఆఫ్ సోషల్ వెల్ఫేర్ స్కీమ్స్ ఫర్ హై స్కూల్ స్టూడెంట్స్ ఇన్ కర్నూలు డిస్ట్రిక్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఇందుకు ఆ వర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వినోద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆక్రమణలపై కొరడా!

☛ పాత బస్టాండ్ కొండారెడ్డి బురుజు ఎదురుగా స్వర్ణకారుల కాంప్లెక్స్‌లో కొందరు ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అయినా, వారు స్పందించకపోవడంతో ఇటీవల ఆ అక్రమ కట్టడాలను తొలగించారు.

☛ ఇలా స్వర్ణకారుల కాంప్లెక్స్‌లోనే కాదు నగరంలో పలుచోట్ల అక్రమ కట్టడాలు వెలిశాయి. నగరపాలక స్థలాలను ఆక్రమించి కొందరు భవనాలు, మరికొందరు వాణిజ్య కాంప్లెక్స్‌లు నిర్మించారు. దీని వల్ల ట్రాఫిక్‌తో పాటు పలు సమస్య తలెత్తుతుండటంతో ఆక్రమణలపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు.

- నగరంలో అక్రమ కట్టడాలపై టౌన్‌ప్లానింగ్ దృష్టి
- అపార్టుమెంట్లు, వాణిజ్య భవన నిర్మాణాల్లో ఆక్రమణలపై వేటు
- అనుమతి లేకుండా నిర్మించిన 1,700 భవన యజమానులకు నోటీసులు
- జియోట్యాగింగ్ ద్వారా ఖాళీ స్థలాల పరిరక్షణ





స్వర్ణకారుల కాంప్లెక్స్‌లో అనుమతిలేని నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది, జేసీబీతో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నగరాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలంటే నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం పనితీరు కీలకం. అయితే, ఈ విభాగంపై గతంలో ఎన్నో విమర్శలు. సక్రమంగా సిబ్బంది ఉండరు. పర్యవేక్షణ అసలే ఉండదు. దీంతో ఈ విభాగంలో అక్రమాలు అధికం. అయితే, గత నాలుగేళ్లుగా ఈ విభాగంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. పైగా కార్పొరేషన్ కమిషనర్లుగా ఐఏఎస్‌లు పనిచేస్తుండటంతో టౌన్ ప్లానింగ్ విభాగం గాడిన పడింది. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క టౌన్ ప్లానింగ్ విభాగంలోనే ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, చైన్‌మెన్లతో సహా పూర్తి స్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి తోడుగా ప్రతి వార్డులో సచివాలయాల సిబ్బంది పనిచేస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో 133 సచివాలయాలు ఏర్పాటు చేశారు. దీంతో పర్యవేక్షణ పూర్తి స్థాయిలో పెరిగింది. భవన నిర్మాణాల్లో ప్లాన్ అనుమతి తీసుకున్నారా.. అనుమతి ప్రకారం నిర్మాణం చేపడుతున్నారా.. నిబంధనలు విస్మరించి డివియేషన్లు చేస్తున్నారా.. తదితరవి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వేటు

నిబంధనలు పాటించని భవనాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డివియేషన్ ఉన్నట్లు గుర్తిస్తే నోటీసులు జారీ చేసి కూల్చేస్తున్నారు. అపార్టుమెంట్లతో పాటు కమర్షియల్ నిర్మాణాల్లోనూ కొందరు డివియేషన్లకు పాల్పడుతున్నారు. అలాంటి నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించి తొలగిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ రాకతో భవన నిర్మాణాలపై పర్యవేక్షణ పెరిగింది. దీంతో ఇటీవల నగరంలో అక్రమ నిర్మాణాల జోరు తగ్గిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

1,700 భవనాలకు నోటీసుల జారీ

వార్డు సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత నగర మంతా ప్లానింగ్ కార్యదర్శుల ద్వారా రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలకు సంబంధించి పూర్తి స్థాయిలో సర్వే చేశారు. ఎన్ని ఇళ్లకు అనుమతులు తీసుకున్నారు. ఎన్ని ఇళ్లకు ప్లాన్ అనుమతి లేదు. అక్రమ నిర్మాణాలు ఎన్ని ఇలా ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తున్నారు. ఏడాది క్రితం చేపట్టిన ఇలాంటి సర్వేలో 1,700 భవనాలకు ముందస్తు అనుమతులు లేనట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. స్పందించని యజమానుల ఇళ్లకు వెళ్లి కుళాయి కనెక్షన్ తొలగిస్తున్నారు. మొండిగా వ్యవహరించే వారికి లోక్ అదాలత్ ద్వారా నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు.

ఖాళీ స్థలాల సంరక్షణకు చర్యలు

నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. గతంలో ఈ స్థలాలను పట్టించుకునే నాథుడు లేడు. నిత్యం పార్కుల ఆక్రమణ గొడవలు, కొట్లాటలు వేయడం, పోలీసులతో స్థానికుల వాగ్వాదం వంటి సంఘటనలు అనేకం జరిగాయి. శరీన్‌నగర్, నేతాజీ హౌసింగ్ కాలనీ, జొహరాపురం, గణేష్‌నగర్, ధనలక్ష్మీనగర్ వంటి కాలనీల్లో ఇలాంటివి అధికం. అయితే, ఇప్పుడు ఆక్రమణల విషయంలో ఆయా ప్రాంతాల్లో మార్పు కనిపిస్తోంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అధికారులు నగరపాలక ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని జియో ట్యాగింగ్ ద్వారా సంరక్షించే పనులు చేపట్టారు. ఇప్పటికే ఎవరూ ఆక్రమించకుండా నగరంలోని 136 స్థలాల చుట్టూ కంచె ఏర్పాటు చేశారు

పర్యవేక్షణ పెరిగింది

టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత లేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాం. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. స్పందించకుంటే లోక్ ఆదాలత్‌ను ఆశ్రయిస్తున్నాం. దీని ద్వారా వసూలు చేసిన జరిమానాలు, పెండింగ్ బిల్డింగ్ ఫీజుల రూపంలో రూ.95 లక్షలు నగరపాలక సంస్థకు ఆదాయం వచ్చింది. నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాం. అలాగే ఖాళీ స్థలాలపై నిఘా పెట్టాం.

– మోహన్‌కుమార్, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్

స్పోర్ట్స్

నేడు బాస్కెట్ బాల్ పోటీలు

కర్నూలు (రూరల్): నగరంలోని బీ క్యాంప్ క్రీడా మైదానంలో నేడు (ఆదివారం) బాల బాలికలకు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ కార్యదర్శి భాను ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి 01 తేదీ లోపు జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికెట్‌తో రావాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు సెల్: 7989173121 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

22న ఒలింపిక్ డే రన్

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా ఈనెల 22 న నిర్వహించే రన్‌ను జయప్రదం చేయాలన్ని క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో నాలుగు చోట్ల నుంచి ప్రారంభమయ్యే ఒలింపిక్ డే రన్ రాజ్ విహార్ కూడలికి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఔట్‌డోర్ స్టేడియం వరకు కొనసాగుతుందన్నారు. క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

టెన్నికాయిట్ క్రీడలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శిల్పా

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డేను పురస్కరించుకుని శనివారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రమేష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ శిల్పా ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జూలై 15వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్‌జి.సృజన మండలస్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో ఇళ్ల పురోగతి, ఉపాధి హామీ పథకం అమలుపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్టేజీ కన్వర్షన్ పనుల్లో జీరో పురోగతి సాధించిన నందవరం, గూడూరు రూరల్, కోసిగి, కౌతాళం మండలాల ఎంపీడీఓలతో కారణాలను విశ్లేషించారు. సాధించాల్సి పురోగతి ఎక్కువగా ఉన్న కోసిగి, కౌతాళం ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధించాల్సిన లక్ష్యాలు ఎక్కువగా ఉన్న కోసిగి, కౌతాళం మంత్రాలయం, వెల్దుర్తి, కర్నూలు అర్బన్ మండలాల మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కోసిగి, మంత్రాలయం మండలాలను సందర్శించి తగిన నివేదిక ఇవ్వాలని ఎస్‌డీసీ మల్లికార్జునుడును ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి లేబర్ మొబిలైజేషన్‌లో తక్కువ శాతం నమోదు చేస్తున్నారన్నారు. దేవనకొండ, కృష్ణగిరి, ఎమ్మిగనూరు మండలాల ఎంపీడీఓలు నూరు శాతం నమోదు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హార్టికల్చర్ ప్లాంటేషన్‌కి సంబంధించి మంజూరైన పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కిల్కారి ఆరోగ్య సేవలను అందించండి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు కిల్కారీ ఆరోగ్యసేవలను అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక బాలాజీనగర్‌లోని సెక్రటేరియట్‌లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణీలు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్ నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతాశిశు ఆరోగ్య భద్రతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కిల్కారీ ఆరోగ్యసేవలను మొబైల్ వాయిస్ కాల్ ద్వారా ఇస్తున్నట్లు తెలిపారు. గర్భిణి, బాలింతలు పాటించాల్సిన ఆరోగ్య నియమాల గురించి 01244588000 నెంబర్ నుంచి వాయిస్ కాల్ ఒక నిమిషం నుంచి 30 సెకన్ల పాటు వస్తుందన్నారు. ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే ఆ సందేశాన్ని వినాలంటే 14423 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి వినవచ్చని చెప్పారు. కాబట్టి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు కిల్కారి ఆరోగ్యసేవల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్త తన పరిధిలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్‌లు ఇవ్వాలని, ముఖ్యంగా ఎంఆర్-1, ఎంఆర్-2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. గర్భిణులు కాన్పునకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని, అలాగే వారు సుఖప్రసవం అయ్యేటట్లు చూడాలని చెప్పారు. అనంతరం సుశ్రుత హాస్పిటల్‌లో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డు, రిపోర్టులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవతి, సిబ్బంది ఉన్నారు.

నగరాన్ని క్లీన్ సిటీ చేద్దాం

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



కేసీ కెనాల్‌లో వ్యర్థాలు, పూడికతీత తొలగించే పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దుదామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం కమిషనర్ నగరంలోని కాలనీల్లో పారిశుద్ధ్య పనులతో పాటు కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో గణనీయంగా మార్పు కనిపించిందన్నారు. ఇంటింటి చెత్త, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ నెలాఖరులోపు వర్షాలు వచ్చే అవకాశాలు ఉండటంతో నగరంలోని అన్ని వార్డులను కలుపుకుని ప్రధాన డ్రైన్లు శుభ్రం చేయడంతో పాటు కేసీ కెనాల్‌లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

వినియోగదారులకు అందుబాటులో ఉండండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింది స్థాయి సిబ్బంది పనిచేసే ప్రాంతంలో ఉండాలని, అప్పుడే సమస్యలు తెలుస్తాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, అలా చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు.

19న ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(అర్బన్): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 2022–23 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఈ నెల 19వ తేదీన ప్రతిభాపురస్కారాలను అందిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నాగేళ్ల రాజగోపాల్‌శెట్టి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మౌర్యాఇన్‌లోని విభూ పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

సీఈఓ దిష్టిబొమ్మ దహనం

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా క్రీడా సంబరాలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఒలింపిక్ సంఘం ఔట్‌డోర్ స్టేడియం ఎదుట సీఈఓ దిష్టిబొమ్మ దహనం చేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బి. రామాంజనేయులు మాట్లాడుతూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సీఈఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఓ సంఘానికి అనుమతి ఇచ్చి మరో సంఘానికి నిరాకరించడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర క్రీడా శాఖ నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నగరవనాల అభివృద్ధికి చర్యలు

- అటవీ శాఖ విజిలెన్స్ అదనపు దళాధిపతి గోపీనాథ్



సిటీ ఫారెస్ట్‌ను పరిశీలిస్తున్న అటవీ శాఖ విజిలెన్స్ అదనపు దళాధిపతి గోపీనాథ్

కర్నూలు కల్చరల్: నగర వనాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అటవీ శాఖ విజిలెన్స్ అదనపు దళాధిపతి గోపీనాథ్ అన్నారు. శనివారం కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ రామకృష్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డితో కలిసి కర్నూలు సిటీ ఫారెస్ట్, విజయ వనం పుల్లయ్య పార్క్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 నగర వనాలు సిద్ధం అవుతున్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగర వనం, విజయ వనం, డోన్, బేతంచర్ల, పచ్చర్ల, బైర్లూటి, ఎమ్మిగనూరు కోటీ కల్ వద్ద నగర వనాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు వాటిలో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అడవుల సంరక్షణకు, వన్య ప్రాణుల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నూలు రేంజర్ సూర్య చంద్రరాజు, ట్రైనీ రేంజర్ తేజస్విని, డిప్యూటీ రేంజర్ నర్సయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో మోటార్ల దొంగలు

కర్నూలు: కర్నూలు నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో మోటార్లు దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న నలుగురు దొంగలను నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మంచినీటి పంపింగ్ కోసం ఇళ్ల బయట ఏర్పాటు చేసుకున్న మోటార్లను దొంగిలించి తక్కువ ధరకు విక్రయించడం, లేదంటే అందులోని రాగి కడ్డీని బయటకు తీసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో నిఘా వేసి ఎన్‌టీఆర్ బిల్డింగ్స్‌లో నివాసముంటున్న ఇద్దరు బుడగజంగాలకు చెందిన మరో ఇద్దరు యువకులు సురేష్, పరుశురాం, మారెప్ప, రాము తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ఆటోలు, సుమారు 20కి పైగా మోటార్లు స్వాధీనం చేసుకున్నారు. కల్లూరు ఎస్టేట్‌లోని శివారు ప్రాంతం ముళ్ల పొదల్లో తస్కరించిన మోటార్లు దాచివుంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఏయే ప్రాంతాల్లో చోరీ చేశారు, ఎంతకాలం నుంచి చేశారు, ఎక్కడ విక్రయించారు, ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? తదితర విషయాలపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

వివాహిత అదృశ్యం

కర్నూలు (సిటీ) : నగరంలోని శ్రీరాం నగర్‌కు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మియా బాషా భార్య షేక్ ఆషా సిద్దిఖా ఈనెల 15వ తేదీ ఉదయం 11:30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. తిరిగి రాలేదు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఆమె తండ్రి నూర్ అహ్మద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైనర్ బాలికపై అత్యాచారం

కర్నూలు (సిటీ) : నగరంలోని ఓ మైనర్ బాలికపై మైనర్ అబ్బాయి అత్యాచారం చేశాడు. బాధిత బాలిక ఫిర్యాదుతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విచారణ అధికారి సీఐ మురళీధర్‌రెడ్డి శనివారం ఉదయం 7:30 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయ దగ్గర మైనర్ అబ్బాయిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు.

జీవితంలో యోగా భాగం కావాలి

కర్నూలు (రూరల్): దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర యోగ సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత రెడ్డి తెలిపారు. ఒలింపిక్ డే క్రీడా సంబరాల్లో భాగంగా శనివారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.... ప్రపంచ దేశాల్లో యోగాకు మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో యోగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, ఉపాధ్యక్షుడు ముంతాజ్ బేగం, కోశాధికారి ఈశ్వర్ నాయుడు, ఒలింపిక్ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత సీసీ కుటుంబానికి బాసట



సీసీ సతీమణికి చెక్ అందజేస్తున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య

కర్నూలు(అగ్రికల్చర్): గూడూరు మండలంలో సీసీగా పనిచేస్తూ గత నెలలో అనారోగ్యంతో మరణించిన గోకారి కుటుంబానికి డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు, సిబ్బంది అండగా నిలిచారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. సీసీ గోకారి మృతి విషయం తెలియగానే డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బంది ఒక్కొక్కరు రూ.1000 ప్రకారం రూ.3 లక్షలు పోగు చేశారు. శనివారం సాయంత్రం డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ చాంబరులో జరిగిన కార్యక్రమంలో గోకారి సతీమణి శాంతకుమారికి చెక్‌రూపంలో అందజేశారు.కార్యక్రమంలో అడిషనల్ పీడీ శ్రీధర్‌రావు, ఏపీఎం(హెచ్ఆర్) కరుణాకర్, యాంకర్ పర్సన్స్, వైకేపీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కర్నూలు కల్చరల్: దేవాలయాల ఆస్తులను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు హెచ్చరించారు. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం జగన్నాథస్వామి దేవాలయానికి చెందిన భూమిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి నిలిపేసినట్లు తెలిపారు. సర్వే నెంబర్ 60లో 6.65 ఎకరాల్లో 42 సెంట్లు తీసుకుని దేవాలయానికి నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. మిగిలిన 6.23 ఎకరాల భూమి ఖాళీగా ఉండగా ఆ గ్రామ నివాసి కేశవరావు అనే వ్యక్తి సర్వే నెం.60లో గల భూమిని 60/3 నెంబరుగా పొందుపరచి అక్రమంగా కల్లూరు సబ్ రిజిస్టర్‌లో డాక్యుమెంట్ నెం.10213/2022 ద్వారా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఆ దేవాలయ భూమిలో షాపులు, ఇంటి నిర్మాణం చేస్తుండగా శనివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, జిల్లా గోరక్షణ మహా సంఘం కార్యనిర్వహణాధికారి టి.హనుమంతరావు, వెంకాయపల్లె యల్లమ్మ దేవాలయ సిబ్బంది సాయికుమార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మనోజ్, సుందర్ సందర్శించి పనులు ఆపివేయించినట్లు వెల్లడించారు.

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులకు ఇబ్బంది తలెత్తకుండా వేళకు బస్సులు నడపాలని కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. ఆదివారం ఆయన డిపోలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు అందాలంటే కండీషన్‌లో ఉన్న బస్సులు నడపాలన్నారు. మెకానికల్ సిబ్బంది బస్సు గ్యారేజీ నుంచి బయటకు వెళ్లే ముందుకు పూర్తిగా పరిశీలించాలన్నారు. సమయపాలన పాటించి నిర్దీత సమయానికి బస్సులు చేరేలా చూడాలని సూచించారు.



